18 వ వసంతంలోకి
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
వైఎస్ఆర్ కడప
సోమవారం 10 మార్చి 2025 : పేజీలు 8

# వాగుగట్టుపై చెలరేగిన మంటలు



**రాజుపాళెం,మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని అర్కటవేముల గ్రామ సమీపంలో ఉన్న తాళ్లవాగు గట్టుపై ఆదివారం రాత్రి మంటలు చెలరేగడంతో ప్రొద్దుటూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు గట్టు దగ్గరే ఉన్న పెట్రోల్ బంక్ సమీపానికి మంటలు రావడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు ముందుగా పెట్రోల్ బంక్ వద్దకు మంటలు రాకుండా అక్కడ సిబ్బంది మంటలను అదుపు చేసే పరికరాలతో ప్రయత్నం చేశారు గ్రామంలోని ట్రాక్టర్ ముందు పంపుతో స్థానికుల సహాయంతో ఫైర్ ఇంజన్ వచ్చేంతవరకు మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ మంటల వల్ల పెట్రోల్ బంకు వద్ద పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో హుటాహుటిన అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు ఆ దారిలో వెళ్లేవారే నిప్పును పడేసి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. తాళ్లవాగు గట్టుపై ఉన్న కంపచెట్లు ఎండు గడ్డికి ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో పెద్ద ఎత్తున అగ్ని కీలకలు లేచాయి ముందస్తు జాగ్రత్తతో పెను ప్రమాదం తప్పింది.




# ఆశల డీఎస్సీ

- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మంత్రి నారా లోకేష్
- మార్చి చివరిలోపే నోటిఫికేషన్
- జిల్లాలో 705 పోస్టుల భర్తీ
- ఖాళీల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- నిరుద్యోగుల మధ్య తీవ్ర పోటీ
- 30వేల మందికి పైగా ఎదురుచూపులు 2లో

**కడప, మేజర్‌న్యూస్ బ్యూరో**

నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈనెల చివరిలోపు నోటిఫికేషన్ జారీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఇటీవలే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఈవిషయాన్ని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటీఫికేషన్ ఉందని అది ముగియగానే ప్రకటన చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 16,347 పోస్టులతో ఈ నోటిఫికేషన్ జారీ చేయనుండగా, కడప జిల్లాలో 705 పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు ఖాళీల వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపారు. అయితే 2024 జూన్ 30న, నవంబర్ 4న నోటిఫికేషన్ విడుదలవుతుందని గతంలో ప్రభుత్వం రెండు పర్యాయాలు ప్రకటించింది. కానీ అనివార్య కారణాలతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. తాజాగా మార్చి చివరిలోపు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశా లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

# జాతీయ లోక్ అదాలత్‌లో 7546 కేసులు పరిష్కారం

### రాష్ట్రస్థాయిలో జిల్లాకు 5వ ర్యాంక్

**కడప,మేజర్‌న్యూస్ :** జాతీయ లోక్ అదాలత్ ద్వారా 7546 కేసులు పరిష్కరించి 26 కోట్ల, 13 లక్షల, 95 వేల, 7 వందల, 84 రూపాయల మొత్తము కక్షిదారులకు చెల్లించడం జరిగినది. రాష్ట్రస్థాయిలో వైయస్సార్ కడప జిల్లాకు 5వ ర్యాంక్ సాధించింది. గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 08-03-2025వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడినది. జిల్లా వ్యాప్తంగా 16 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగినది. జాతీయలోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా క్రిమినల్ 7231 కేసులు, 197 సివిల్ కేసులు, 118 ఫ్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారము అయ్యాయన్నారు. 26 కోట్ల, 13 లక్షల, 95 వేల, 7 వందల, 84 రూపాయలు కచ్చిదారులకు చెల్లించబడినది. కడప లో 2109 కేసులు, పొద్దుటూరు లో 2082 కేసులు, రాజంపేట లో 933 కేసులు, రాయచోటి లో 240 కేసులు, బద్వేల్ లో 283 కేసులు, జమ్మలమడుగులో 1005 కేసులు, సిద్ధవటంలో మిగతా 2పేజీలో

# తగ్గిపోయిన ధరలతో పత్తి రైతు కష్టాలు..




కొనుగోలుకుముందుకురాని వ్యాపారస్తులు - ఏటేటాగణనీయంగా తగ్గుతున్న పంట సాగు

**రాజుపాళెం, మేజర్‌న్యూస్:** గడచిన కాలంలో పత్తి పంట సాగులో పెరిగిన పెట్టుబడులు తగ్గిపోయిన ధరలతో రైతులు కష్టాలు పడుతున్నారు పంట దిగుబడులు ఇళ్లకు చేర్చుకున్నప్పటికీ సరైన ధర కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది ఈ ప్రాంతంలో పత్తి కొనుగోలుకు వ్యాపారస్తులు ముందుకు రావడం లేదు పత్తి మిల్లులు కూడా మూత వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది దారము గింజలకు డిమాండ్ లేదు జిల్లాలోనే రాజుపాళెం మండలంలో పత్తి పంట సాగును విస్తారంగా సాగు చేసేవారు మిగతా ప్రాంతాల్లో కూడా పత్తి పంట సాగు విస్తరించింది ఈ పంట సాగులో పెరిగిన పెట్టుబడులు కూలీల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి రాను రాను పత్తి పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు గతంలో ఒక రాజుపాళెం, మండలంలోనే 10వేల నుంచి 12 వేల ఎకరాల వరకు పంటసాగు మిగతా 2పేజీలో

# ప్రొద్దుటూరులో టిడిపికి షాక్

### సొంతగూటికి వైఎస్ఆర్సీపీ కౌన్సిలర్లు
### టిడిపి నుండి వైసీపీలో చేరిన ముగ్గురు కౌన్సిలర్లు



**కడప మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ప్రొద్దుటూరు మున్సిపల్ రాజకీయం రకరకాల మలుపులు తిరుగుతూ రసవత్తరంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీలోకి దూకిన మున్సిపల్ వైసిపి కౌన్సిలర్లు తిరిగి సొంత గూటికి చేరుకుంటున్నారు. ఆదివారం ముగ్గురు కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలో చేరారు. దీంతో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఆధిపత్యపోరు ఆసక్తికరంగా మారింది. ఇటీవల ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని ముగ్గురు కౌన్సిలర్లు వైయస్సార్సీపీ నుండి టిడిపిలో చేరిన విషయం తెలిసిందే. వారిలో 8వ వార్డు కౌన్సిలర్ రాగుల మిగతా 2పేజీలో

# రోడ్డుపైనే చెత్తాచెదారం

### దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



6లో

# అంగన్వాడీలను అరెస్ట్ చేయడం అన్యాయం : సిఐటియు

కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ : రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని రేపు తలపెట్టిన ఆందోళన సందర్భంగా కడప జిల్లాలో అంగన్వాడి వర్కర్ల నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం, నిర్బంధించడం సరైనది కాదని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేయడానికి రేపు విజయవాడ అలంకార వద్ద ప్రభుత్వం పరిమిషన్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ జిల్లాలో అంగన్వాడి వర్కర్స్ ను పోలీసులు ద్వారా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా అధికారులతో ఇబ్బంది పెట్టడం సరింది కాదని తెలిపారు. అధికారులు, ప్రభుత్వం 26 వేల జీతం పెంచితే ఇలాంటి ఆందోళన చేయాల్సిన అవసరం వుండదు కదా అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు మానుకొని జీతం పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్స్ ఏం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత అని తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 7546 కేసులు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

137 కేసులు, రైల్వేకోడూరు లో 157 కేసులు, పులివెందులలో 365 కేసులు, నందలూరు లో 80 కేసులు, లక్కిరెడ్డిపల్లిలో 26 కేసులు, కమలాపురం లో 129 కేసులు జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కరించబడినవి. జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులకు, పత్రిక విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో కడప వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కు లకు, అగ్రికల్చరల్ అధికారులకు మరియు మిగతా శాఖల అధికారులు అందరికీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గౌరవ అధ్యక్షులు జి. శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

# త్వరలో ఆశల డీఎస్సీ

ఉపాధ్యాయ నిరుద్యోగ యువత కలలను కూటమి సర్కారు నిజం చేయబోతుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా మార్చి చివరిలో మెగా డీఎస్సీ 2025 నోటిఫికేషన్ విడుదలకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ కొనసాగుతుండటంతో అది తొలగిపోగానే ఏ క్షణమైనా నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టులతో ఈ నోటిఫికేషను జారీ చేస్తారు. 2024 నవంబర్ నాటికి కడప జిల్లాలో 705 టీచర్ పోస్టులు ఖాళీలున్నాయి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ ఖాళీల సంఖ్య స్వల్పంగా మారే అవకాశం ఉంది. ఎటువంటి వివాదాలకు తావులేకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూడు, నాలుగు నెలల్లో భర్తీ ప్రక్రియ ముగించి, ఆ వెంటనే ఎంపికైన వారికి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టడంతో నిరుద్యోగ యువతలో ఆనందం వ్యక్తవుతోంది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఉన్న ఖాళీలు వివరాలను ప్రభుత్వం గత ఏడాది నవంబర్ లోనే విడుదల చేసింది. ఆ నెల 4న షెడ్యూల్ విడుదల చేసి, మార్చి నాటికి నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని అప్పట్లో ప్రయత్నాలు మొదలు పెట్టింది. జిల్లా, మండల పరిషత్, మున్సిపల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న మొత్తం పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. డీఎస్సీలో భాగంగా కడప జిల్లాలో 645 పోస్టులు, అన్నమయ్య జిల్లాలో 509 పోస్టుల భర్తీకి అవకాశం ఉన్నట్లు గత ఏడాది మే నెలలో విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఎన్నికల ముందు గత ప్రభుత్వం ప్రకటించినా పరీక్ష నిర్వహించకుండా వదిలేసిన డీఎస్సీ కంటే మూడురెట్లు ఎక్కువ ఖాళీలు భర్తీ చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా చెప్పారు. అయితే ఆ ప్రక్రియ అనూహ్యంగా ఆగిపోయింది. గడచిన మూడేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం టెట్ నిర్వహించకపోవటంతో కొంత ఇబ్బంది తలెత్తింది. ప్రస్తుతం టెట్ సమస్య తొలిగిపోవడంతో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోస్టుల సంఖ్య కూడా స్వల్పంగా పెరిగింది.

**జిల్లాలో 705 పోస్టులు ఖాళీలు..**

కడప జిల్లాలో 2024 సెప్టెంబర్ 30 నాటికి 705 ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఎస్జీటీ (తెలుగు) పోస్టులు 252, ఎస్జీటీ (ఉర్దు) పోస్టులు 45 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ కేటగిరికి సంబంధించి 108 పోస్టులు ఉన్నట్లు సమాచారం. స్కూల్ అసిస్టెంట్లో లాంగ్వేజ్-1లో సంస్కృతం, తెలుగు, ఉర్దూ కలిపి 34 పోస్టులు, హిందీ 18, ఇంగ్లీష్ 81, గణితం 44, ఫిజికల్ సైన్స్ 31, బయాలజీ 53, సోషల్ స్టడీస్ 65 (పై నాలుగు సబ్జెక్టులకు సంబంధించి తెలుగు, ఉర్దూ మీడియం కలిపి) ఖాళీలు ఉన్నాయి. ఫిజికల్ ఎడ్యుకేషన్ 82 ఖాళీలు కలిపి కడప జిల్లాలో మొత్తం 705 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

**30 వేలమంది డీఎస్సీ కోసం ఎదురుచూపులు..**

ఐదేళ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటిస్తుండడంతో ఈసారి పోటీ తీవ్రంగా ఉంది. ఇప్పటికే టెట్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు డీఎస్సీ ప్రకటన కోసం అతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది బీఎడ్, డీఎడ్ పూర్తిచేసిన వారు కూడా టెట్ రాసి డీఎస్సీ రాసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించవచ్చు. తద్వారా అభ్యర్థుల సంఖ్య భారీగా పెరగనుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్క కడప జిల్లా నుంచే సుమారు 30 వేల మంది డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారని తెలుస్తోంది. కాగా... రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014లో తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు డీఎస్సీ ద్వారా 9,061 పోస్టులు భర్తీ చేశారు. మరో నాలుగేళ్ల తర్వాత ఆయనే 2018 డీఎస్సీ ద్వారా 7,254 పోస్టులు భర్తీ చేశారు. 2019లో ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అయిదేళ్లు డీఎస్సీ నిర్వహించలేదు. తిరిగి చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రస్తుతం డీఎస్సీ ప్రకటన వెలువడబోతోంది. ఈసారి కడప జిల్లాలో 705 పోస్టులు భర్తీకి అవకాశం ఉంది. ఖాళీల సంఖ్యలో కొద్దిగా అటూ, ఇటూ మార్పులున్నా, గతం కంటే ఈసారి ఎక్కువ పోస్టులు భర్తీ చేయనుండడంతో యువత ఉత్సాహంగా ఉంది. డీఎస్సీ కోసం ఆశగా ఎదురు చూస్తోంది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ మార్చి చివరి లేదా ఏప్రిల్ మొదటి వారంలో జారీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. న్యాయ వివాదాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూడు, నాలుగు నెలల్లో భర్తీ ప్రక్రియ ముగించి, ఆ వెంటనే ఎంపికైన వారికి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. మెగా డీఎస్సీ పూర్తయితే రాష్ట్రంలోని సింగిల్ టీచర్ స్కూళ్లకు అదనంగా ఉపాధ్యాయులు వస్తారు. అలాగే ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీరనుంది. కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో తీసుకురానున్న సంస్కరణలు వేగంగా అమలు చేసే అవకాశం ఉంది. మంత్రి నారా లోకేష్ డీఎస్సీ భర్తీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

# మాజీ సైనికుల సంక్షేమానికి మహా ర్యాలీ

**కడప, మేజర్‌న్యూస్ :** కడప మరియు అన్నమయ్య జిల్లాల్లోని మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువులు మరియు వారి కుటుంబ సభ్యులు కు శుభవార్త. మార్చి 16, 2025న జిల్లా పరిషత్ సమావేశ మందిరం, కడప లో మాజీ సైనికుల మహా ర్యాలీ నిర్వహించబడనుంది. ఈ మహా ర్యాలీ ద్వారా ఆర్థిక, పెన్షన్, వైద్య, పరిపాలనా సమస్యల పరిష్కారం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమంలో ఈసిహెచ్ఎస్ మెడికల్ క్యాంప్, పెన్షన్ సెల్, బ్యాంక్ స్టాళ్లు, సిఎస్డి స్టాళ్లు, జిల్లా పరిపాలన ఫిర్యాదు కేంద్రాలు ఏర్పాటు చేయబడి, మాజీ సైనికుల సమస్యలు తక్షణమే పరిష్కరించబడతాయి. యుద్ధ వీరుల కుటుంబాలను సన్మానిం చడం,వీరమాతలకు గౌరవం నివ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని జిల్లా సైనిక సంక్షేమ అధికారి తెలిపారు.

## ప్రొద్దుటూరులో టిడిపికి షాక్

(మొదటి పేజీ తరువాయి)

శాంతి, 40వ వార్డు కౌన్సిలర్ రావులకొల్లు అరుణ, 39వ వార్డు కౌన్సిలర్ చింపిరి అనిల్ కుమార్ లు ఉన్నారు. ఆదివారం వీరు ముగ్గురు ప్రొద్దుటూరు మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్సీపీలో చేరారు. రాచమల్లు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాచమల్లు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అబద్ధపు మాటలతో మోసాలతో మభ్యపెడుతూ పబ్బం గడుపుకుంటోందని ఆరోపించారు. ప్రజల దృష్టి మరలించేదుకు వైసీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతూ బెదిరింపులకు దిగుతోందన్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారని, ఎక్కువ రోజులు కూటమి ప్రభుత్వ మోసాలు సాగవని తెలిపారు.

# తగ్గిపోయిన ధరలతో పత్తిరైతు కష్టాలు...

(మొదటి పేజీ తరువాయి)

చేసేవారు ప్రస్తుతం వ్యవసాయ అధికారుల గణాంకాల మేరకు1526 ఎకరాల్లో పత్తి పంట సాగు అయింది పత్తికి పింకు బోల్వాన్ ఎర్ర గులాబీ రంగు పురుగు ఆశిస్తూ ఉండడంతో పత్తి పంట సాగును రైతులు తగ్గిస్తూ వచ్చారు పెరిగిన పురుగుమందు ధరలు రసాయనిక ఎరువులు నీటి తడులుమొక్క నుంచి పత్తిని వేరే చేసేందుకు అయ్యే కూలీ ఖర్చులుపంట సాగులో పెట్టిన పెట్టుబడులకు సరిపోవడం లేదు గతంలో కౌలుకు భూమిని తీసుకొని పత్తి పంటను సాగు చేసేవారు ఆ పరిస్థితులన్నీపత్తి పంట సాగులోమారిపోయాయి. పకృతి కరుణించకపోవడం సకాలంలో వర్షాలు రాక పత్తి రైతులు ఇబ్బందులు పడ్డారుగతంలో గ్రామాల్లోనే ఎక్కువమంది పత్తి వ్యాపారం చేసేవారు ఇక్కడ కొనుగోలు చేసిన పత్తిని కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు పత్తి మిల్లులకు తరలించేవారు అలాగే ఏపీలోని గుంటూరు ఆదోని యార్డుకు పత్తి తరలి వెళ్ళేది ఒక రోజుకు 200 నుంచి 500 లోపు పత్తి లారీలు మిల్లులకు వ్యాపారస్తులు తరలించేవారు ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది పత్తి మిల్లులకు ఒకటిరెండు లారీలు వెళుతున్నాయని సమాచారం ఒకప్పుడు గుంటూరులో 2,000 వేలదాకా పత్తి మిల్లులు ఉండగా ప్రస్తుత 50మిల్లులు పనిచేస్తున్నాయి అందులో రెండు మూడు మిల్లులకు మించి పత్తి వెళ్లలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు మిగతా పత్తి మిల్లుల పరిస్థితి కూడా ఇలానే ఉంది అక్కడ పత్తిని బెల్లుగా తయారుచేసి పత్తి క్యాండీగా తయారుచేసి వివిధ ప్రాంతాలకు తరలిస్తారు గతంలో పత్తి క్యాండీ ధర రూ1,10,000



లక్షలు ఉండగా ప్రస్తుతం రూ 45,000 వేల నుంచి రూ 50,000 వేల వరకు ధర పలుకుతోంది గింజలు గతంలో రూ3,600 వేలు ఉండగా ప్రస్తుతం 2,600 ధర పలుకుతోంది2022 ఏడాదిలో పత్తి క్వింటాల్ ధరూ11,700 వేలు ఉండగా ప్రస్తుతం పత్తిని బట్టి రూ5,500 వేల నుంచి రూ6000 వరకు ధర ఉంది గత రెండేళ్లుగా పత్తి ధరలు తగ్గుతూ వస్తున్నాయి రాబోయే రోజుల్లో తెల్ల బంగారం గా పిలవబడే పత్తి పంట సాగు పూర్తిగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి చాలామంది రైతులు ఆరుతడి పంటలైన మినుము జొన్న కొర్ర నువ్వులు శనగ పంటల పైన రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు పత్తి ధర తగ్గుముఖం పట్టిందానికి సరైన కారణాలు కనిపించడం లేదు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పత్తికి సరైన ధర అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు


## గ్రామ పంచాయతి కార్యాలయము

రంగసముద్రం, పోరుమామిళ్ళ మండలం,

టెండర్ ప్రకటన

ఆర్.సి.నెం. 05/2025 తేది : 09/03/2025

వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ళ మండలం, రంగసముద్రం పంచాయతి కార్యాలయములో ఈ దిగువ కనపరచిన కాంట్రాక్ పోస్టులలో వాటికి ఎదురుగా చూపబడిన కాలమునకు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఆసక్తి కల్గిన వ్యక్తుల నుండి టెండర్లు కోరబడుచున్నవి కావున ఈ క్రింది తెలుపబడిన పోస్టులలో పనిచేయుటకు ఉత్సాహము కలవారు తేది 10/03/2025 నుండి12/03/2025 తేదీన మధ్యాహ్నం 12 గంటల వరకు సిల్డ్ కవర్లో టెండర్లు టెండర్ బాక్స్ యందు వేయవలెను. అదే రోజు అనగా 12-03-2025 సాయంత్రం 4 గంటలకు శ్రీ సర్పంచ్ రంగసముద్రం గ్రామ పంచాయతి వారిచే హాజరైన టెండర్‌దారుల పక్షములో టెండర్లు తెరవబడును. ఇతర వివరములకు కార్యాలయ పనిదిన వేళలలో తెలుసుకోవచ్చును.

| క్రమ సంఖ్య | కాంట్రాక్టు పని వివరములు | కావలసిన వ్యక్తుల సంఖ్య | పనిచేయవలసిన కాలము | చెల్లింవలసిన దరావత్తు |
|---|---|---|---|---|
| 1. | పారిశుద్ధ్యము నిర్వహణ | 08 | 01-04-2025 నుండి 31-03-2026 | రూ. 100-00 |
| 2. | రక్షిత మంచినీరు సరఫరా | 09 | 01-04-2025 నుండి 31-03-2026 | రూ. 100-00 |
| 3. | వీధి విద్యుత్ దీపములు | 02 | 01-04-2025 నుండి 31-03-2026 | రూ. 100-00 |

ఈ టెండర్ల పక్రియ మొత్తం గ్రామ పంచాయతి నిబంధనలకు లోబడి నిర్వహించబడును. తుది నిర్ణయము గ్రామ పంచాయతికి వుంటుంది.

సం/- శ్రీ ఏ రాజవ్ రెడ్డి,
పంచాయతి కార్యదర్శి,

సం/- శ్రీ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్
రంగసముద్రం పంచాయతి.

షరతులు :- పైన తెలిపిన టెండర్లను ఏ సమయములోనైనా వాయిదా వేయుటకు మరియు రద్దు చేయుటకు గ్రామ పంచాయతికి వారికి అధికారము కలదు. 2. మిగతా షరతులు మరియు వివరములకు కార్యాలయ పనివేళలో తెలుసుకోవచ్చును.

# అనాథలకు అండగా నిలుస్తున్న పాపిజెన్ని రామకృష్ణారెడ్డి



**కలసపాడు, మేజర్‌న్యూస్ :** పేదరికం నుంచి వచ్చిన ఆయన 'నాకు పేదల ఆకలి తెలుసు. సమాజం పట్ల బాధ్యతగా మెలగడం తెలుసు. విద్య విలువ తెలుసు' అంటారు. కడపజిల్లా కలసపాడు మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన పాపిజెన్ని రామకృష్ణారెడ్డి. పేద పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేయడం దగ్గర నుండి గ్రంథాలయాలు స్థాపించడం, అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించ డం, రక్తదానం, విద్యాదానం, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడం ఇలా ఎక్కడ తన అవసరముంటుందో అక్కడ రెక్కలు కట్టుకుని వాలిపోతాడు. తన గ్రామంలో తరతరాలుగా వస్తున్న కల్తీసారా తయారీ బట్టీలను, బెల్టుషాపులను తుడిచి పెట్టే యడంలో ఓ ఉద్యమమే చేశారు. గ్రామంలోని యువతనంతటినీ పోగేసి 250 కుటుంబాలు గల తన గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో ఎనలేని కృషి చేసి, ఎంతోమంది యువతకు గొప్ప స్ఫూర్తిగా నిలిచారు.

### చదువుకోవటానికి పని చేశాను

ఆర్థిక ఇబ్బందులతో అర్ధంతరంగా చదువుకు స్వస్తిచెప్పిన రామకృష్ణారెడ్డి పదో తరగతి ఉత్తీర్ణత తరువాత రెండేళ్ల పాటు చిన్న చిన్న పనులు చేసేవారు. వార్డు బాయ్‌గా, రంగులు వేస్తూ ఉండేవారు. అయితే దిశానిర్దేశం లేకుండా అలా జీవిం చడం ఎంతమాత్రం ఇష్టం లేక మళ్లీ చదువుకొనసాగించాలని కాలేజీలో చేరారు. 'అమ్మా నాన్నకు ఈ విషయం చెప్పినప్పుడు మా దగ్గర అంత స్థోమత లేదు నాయన. అని కన్నీళ్లు పెట్టుకున్నారు. మా చిన్నప్పుడు రోజువారీ ఖర్చుల కోసం అమ్మ ఇంటింటికీ వెళ్లి కూరగాయలు అమ్మేది. అలా చేస్తేనే మాకు తిండి, పుస్తకాలు వచ్చేవి. అందుకే ఇప్పుడు కాలేజీ చదువు అంటే వాళ్లు అంతలా భయపడుతున్నారు. అందుకే వాళ్లకి ఇబ్బంది కలిగించకుండా పనులు చేసి సంపాదించు కుంటూ నా చదువు కొనసాగించాను' అంటూ గత స్మృతులు గుర్తుచేసుకున్న ఆయన ఉన్నత విద్యలో మెరుగైన ప్రతిభతో రాణించి చదువులో ముందుకెళ్ళాడు.

### వివేకానందుని స్ఫూర్తి..

రామకృష్ణారెడ్డి ఇంటర్ చదివే సమయంలో రిటైర్ డాక్టర్ మార్కారెడ్డి కాలేజీకి వచ్చారు. 'ఆయన చెప్పిన వివేకానంద బోధనలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. ఏడాదిపాటు వివేకానంద పుస్తకాలు చదివాను. సమాజానికి ఉపయో గపడే పనులు చేయాలని అప్పుడే సంకల్పించుకున్నాను. అలా కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడే స్నేహితులందరం కలిసి ఒక బృందంగా ఏర్పడి రోడ్ల మీద నిరాశ్ర యులకు ఆహారం ఇవ్వడం, ఆశ్రమాలకు తరలించడం, అవసరమైన వాళ్లకు రక్తదానం, పేద పిల్లలకు పుస్తకాల పంపిణీ చేసేవాళ్లం. ట్యూషన్లు చెబుతూ వచ్చిన పాకెట్ మనీతో మరియు మా సేవలు చూసి దాతలు అందించే సాయంతో చేసేవాడిని.

### కరోనా కలిచివేసింది..

ప్రభుత్వ స్కూల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఏడాది 500 మందికి చొప్పున అన్ని తరగతుల వారికి ఆరేళ్లపాటు ఉచిత పుస్తకాలు, స్కూలు బ్యాగులు, అవ సరమైన సామగ్రి పంపిణీ చేశాం. గ్రామంలో గ్రంథాలయం స్థాపించి విజయ వంతంగా నిర్వహించాను. కడప జిల్లాలో చదువుకోవటానికి ఆసక్తి ఉన్న విద్యార్థు లకు ఆర్థిక సహాయం అందించాను. 2010 నుండి వివేకానంద ఫౌండేషన్ పేరుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన నేను కరోనా సమయంలో ఎంతోమంది అనాథలు తిండిలేక, ఆదరించే వారు లేక రోడ్డుమీదే మరణించడం చూసి చలించి పోయాను. అప్పటివరకు వైద్య చికిత్సలు అవసరమున్న ఎంతోమంది నిరాశ్రయు లను ఆస్పత్రులకు తీసుకెళ్లడం, వారి బంధువులకు సమాచారం అందించడం చేసే వాడ్ని. అప్పటి వరకు నా ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చేవాడ్ని. కాని లాక్‌డౌన్‌లో వారి కోసం ప్రత్యేకంగా ఓ వసతి గృహం నిర్మించాలనుకున్నాను' అంటున్న రామకృ ష్ణకు రైల్వే గేట్‌మెన్‌గా వచ్చిన సంపాదనే జీవనాధారం. మొదట్లో సగం జీతం సేవాకార్యక్రమాలకు ఖర్చు పెట్టిన ఆయన ఆ తరువాత మొత్తం సంపాదన వినియోగించేస్తున్నారు.

### వివేకానంద సేవాశ్రమం

'నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలన్న ఆలోచనైతే ఉంది కాని ఎలా? నా దగ్గర అంత డబ్బు లేదు.. అప్పుడే మా బంధువైన బోయిళ్ళ విద్యార్థన రెడ్డి ఎకరా స్థలం ఇచ్చారు. ఆ తర్వాత నా ఆత్మీయ సోదరుడు రాజోలి శ్రీధర్ రెడ్డి అన్న బోరు వేయించాడు. ఆ స్థలంలో వసతి గృహం నిర్మించేందుకు నా భార్య నగలు తనఖాలో పెట్టాను. ఆ తరువాత ఎంతోమంది స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. ముఖ్యంగా స్వాతి శిరీషా రామకృష్ణారెడ్డి, నరాల శ్రీనివాస రెడ్డిలు బాగా సహాయం అందించారు. ఇప్పుడు అన్ని వసతులతో 'వివేకానంద సేవాశ్రమం' పేరుతో ఆ శ్రమం నిర్వహిస్తున్నాను. వీరితో పాటు నేనూ, నా భార్య, పిల్లలు ఇక్కడే ఉంటాం. వారితోను కలిసి ఉంటూ ఒక కుటుంబంలో ఆప్యాయత, అనురాగంలతో జీవిసు_్తన్నాం. ఇక్కడకు వచ్చే వారిలో అనాథలే కాదు, నిరాశ్రయానికి గురైనవారూ ఉన్నారు. పిల్లలున్నా రోడ్డు మీద పడ్డ తల్లిదండ్రులను చేరదీస్తున్నాను. కొంతమందిని వారి పిల్లలకు కౌన్సిలింగ్ ఇప్పించి పంపిస్తున్నాను. అనారోగ్యంతో శరీరం పుండ్లు పడి, దుర్వాసన వస్తున్న వారిని కూడా ఆదరిస్తూ వారికి సేవలు అందిస్తున్నాను. మలమూత్రాలతో మంచానికే పరిమితం అయినవారికి సేవ చేయటం మా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఎందరో వ్యక్తులు ఎన్నో సంఘటనలు నన్ను ప్రభావితం చేశాయి. దశాబ్దకాలం గడిచిపోతున్నా మొదటి రోజున ఏ దృఢ నిశ్చయంతో ఉన్నానో... ఇప్పటికీ అలాగే ఉన్నాను. ఈ ప్రయాణంలో ఎదురు దెబ్బలే కాదు.. ప్రశంసలు, అవార్డులు కూడా ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో ఒకరికి మాత్రమే ప్రతిష్టాత్మకంగా అందించే "జనమంచి గౌరీశంకర్ యువపురస్కారం" ఇటీవల విదేశీ వ్యవహారాల శాఖ కేంద్ర మంత్రి మురళీధరన్ చేతుల మీదుగా అం దుకున్నారు. "అంటున్న రామకృష్ణారెడ్డి డబ్బు ఉండి ఈ పనులు చేయడం లేదు. నా ప్రయత్నంలో ఎందరో భాగస్వాములు.. నా తల్లిదండ్రులు, నా భార్య రామ తులసి, దాతల సహకారం ఎంతో ఉంది. అనాథశవాల అంత్యక్రియల్లో నాతో పాటు నా భార్య రామ తులసి కూడా పాల్గొంటుంది. ఆత్మీయులు స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తూ నన్ను ప్రోత్సహిస్తూ, సహకరించడం వల్లే ఇవన్నీ చేయగలుగుతున్నాను' అంటున్నారు రామకృష్ణారెడ్డి.















# జామియా మసీదు ఇఫ్తార్ విందులో పాల్గొన్న భూపేష్ రెడ్డి

## భక్తులకు బిరియాని, పండ్లు పంపిణీ



**జమ్మలమడుగు మేజర్‌న్యూస్:** పట్టణంలోని జామియా మసీదులో ఆదివారం సాయంత్రం పవిత్ర రంజాన్ మాసం యొక్క ఉపవాస దీక్షలలో భాగంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డిని ఘనంగా కాశ్మీర్ శాలువా, పూలదండలతో సత్కరించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులు చిన్నారులు, పెద్దలు అన్న తేడా లేకుండా ఉపవాస దీక్షలు పాటిస్తారని ఇది ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు.అనంతరం జామియా మసీదు పీఠాధిపతి సాదిక్ పాషా ఖాద్రి మాట్లాడుతూ ఎంతో నియమ నిష్టలతో పాటించే రంజాన్ పండుగ ఉపవాస దీక్షలతో తమ జీవిత కాలంలో చేసిన పాపాలు ప్రక్షాళన గావిస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా రంజాన్ పండుగ ఉపవాస దీక్ష ఆచరించిన ముస్లింసోదరులు, చిన్నారులు, పెద్దలకు అందరికీ చికెన్ బిర్యానీ, పండ్లు, చల్లటి త్రాగునీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురువులు, జామియా మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ షామీర్ భాష, ఖాదర్వల్లి, మదార్ భాష, హాఫీస్, బాబుల్ ఖాన్, కొమెర్ల శేక్షావలి,లాలు, ముస్లిం మైనారిటీ నాయకులు బేపారి మహమ్మద్ రఫీ, దలాల్ షబ్బీర్, డంకా ఎస్దాని, ముస్లిం సోదరులు భక్తులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లు 2024 వెంటనే రద్దు చేయాలి

## కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్




**కడప మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ కడప జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ఆదివారం నిర్వహించడం జరిగింది. కడపనగరంలోని రవీంద్రనగర్ యూఎస్ మహల్ ఫంక్షన్ హాల్ నుంచి 7రోడ్స్ వరకు ర్యాలీతో కేంద్ర, రాష్ట్ర కూటమి పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలుచేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు చట్టం రద్దు చేసేంతవరకు పోరాటాలు చేపడతామన్నారు.కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా పరిపాలన చేస్తోంది.దేశంలో ఉండే ప్రజలను హిందూ, ముస్లిం అంటూ బిజెపి పార్టీ గొడవలు, అల్లర్లు సృష్టిస్తుందన్నారు.సవరణ చట్టం 2024 రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా మరింత నిరసన కార్యక్రమాలు చేపడతామని బిజెపిని ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు బాబు భాయ్ ,కాంగ్రెస్ సిటీ ప్రెసిడెంట్ అఫ్జల్ ఖాన్,ముఫ్తీ రహీముల్లా ఖాన్ సాహెబ్, గాలి చంద్ర, సిపిఎం డిస్టిక్ ప్రెసిడెంట్, చంద్రశేఖర్, సిపిఐ డిస్టిక్ ప్రెసిడెంట్, భాస్కర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షులు హమీద్, కాంగ్రెస్ నాయకుల గౌస్ పీరు, మౌలానా జాకీర్ సాహెబ్, ఎస్ డి పి ఐ నాయకులు ,ఇతర పార్టీ నాయకులు, కడప నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎన్జీఓ అసోసియేషన్ మహిళా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

### చైర్ పర్సన్‌గా టి.యం.సువర్ణ



మైదుకూరు, మేజర్‌న్యూస్ : మైదుకూరు తాలూకా ఏపిఎన్ జిజిఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తాలూకా ఎన్‌జిఓ మహిళా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు మైదుకూరు తాలూకా ఏపిఎన్ జిఓ అసోసియేషన్ అధ్యక్ష,, కార్యదర్శి, చంద్రమౌళి,రాఘవయ్యలు తెలియజేశారు. ఆదివారం మైదుకూరు మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో తాలూకా మహిళా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు తెలిపారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో బద్వేలు డిప్యూటీ డియంహెచ్‌ఓ డాక్టర్ వీరమల్లు మల్లేష్ ను మైదుకూరు తాలూకా ఏపిఎన్ జీఓ గౌరవ అధ్యక్షుడుగా ఎన్ జి ఓ సభ్యులు హర్షధ్వానాల మధ్య ఎన్నుకున్నారు. మైదుకూరు తాలూకా ఏపిఎన్ జిజి ఓ మహిళా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. నూతన మహిళా కార్యవర్గంలో అధ్యక్షురాలు, చైర్‌పర్సన్‌గా టి.యం.సువర్ణ . వైద్య ఆరోగ్య శాఖ. పిహెచ్ సి, దువ్వూరు, కన్వీనర్‌గా పి.సుజాత, అర్బన్ హెల్త్ సెంటర్ మైదుకూరు. కె.ఉమా, యండిఓ ఆఫీసు,మైదుకూరు. ఉపాధ్యక్షులుగా పి.స్వర్ణలత వైద్య ఆరోగ్య శాఖ, యం.యశోద, పశుసంవర్ధక శాఖ యన్.వసుంధర, సంయుక్త కార్యదర్శులుగా దీవెనమ్మ. సి.కల్పన మహిళాపోలీసు, ప్రశాంతి వైద్య ఆరోగ్య శాఖకు చెందిన వారిని ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే మైదుకూరు ఏపిఎన్జీఓ తాలూకా అధ్యక్ష, కార్యదర్శి, గజ్జల చంద్రమౌళి, మాచనూరు రాఘవయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యన్‌జిఓ నాయకులు, కోశాధికారి లక్కినేని బాబు, ఉపాధ్యక్షులు పెంచల్ రెడ్డీ, పివివి.ప్రభాకర్, జాయింట్ సెక్రటరీలు, పద్మావతీ, రామగుప్త, తులసమ్మ, యన్‌జిఓ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు

### అసంఘటితరంగా,భవన నిర్మాణ కార్మిక శక్తి పోరాట యూనియన్ అధ్యక్షుడు కె.ఓబులేసు



చెన్నూరు మేజర్‌న్యూస్ : కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అసంఘటితరంగా,భవన నిర్మాణ కార్మిక శక్తి పోరాట యూనియన్ అధ్యక్షుడు కె.ఓబులేసు అన్నారు.మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అధ్యక్షుడు ఓబులేసు ఆధ్వర్యంలో ఆదివారం మండలం పరిధిలోని పలు గ్రామ ప్రజలు,కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస్థితులు లేబర్ కార్డుల గురించి చర్చించారు. మండల చుట్టుపక్క పల్లెల్లో పనులు చేసుకుంటున్న రోజువారి కూలీలు వారి పరిస్థితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కార్డులు ఉన్నవాళ్లకు ఆ కార్డులకు సంబంధించిన సంక్షేమాలు ఏవి కూడా ఇవ్వలేదని దింతో కార్మికులు చాలా ఇబ్బందులకు గురయారన్నారు.ఇప్పుడైనా ప్రభుత్వము కార్మికుల పట్ల వారికున్న లేబర్ కార్డులు ఉన్న కార్మికులకు సంక్షేమాలు ఇవ్వాలన్నారు. అసంఘటితరంగా,భవన నిర్మాణ కార్మిక శక్తి పోరాట యూనియన్ తరపున కార్మికుల సంక్షేమానికి పోరాటం చేస్తామన్నారు.ఈ సమావేశంలో శివన్న,సుబ్బరాయుడు,దర్గయ్య దొరస్వామి,రామనపల్లె గంగయ్య,జయన్న,అస్లాను సాదిక్,మహమ్మద్ అలీ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి సెర్ప్ ఎల్ టు కమ్యూనిటీ కోఆర్డినేటర్ల వినతి పత్రం



పులివెందుల, మేజర్‌న్యూస్: రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖలో పనిచేసే కమ్యూనిటీ కోఆర్డినేటర్లు (ఎల్ 2) ఉద్యోగుల సంఘం నేతలు ఆదివారం ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పులివెందులలోని ఆయన స్వగృహంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఎల్2 ఉద్యోగుల సంఘం నేతలు ఇబ్రహీం, రామాంజనేయ రెడ్డి, ఆదిశేషు, సురేష్ బాబు, కంబయ్య, ఆది కృష్ణయ్య, గంగాధరలు ఈ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి ఇచ్చారు. అందులోని విషయాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతి పథకాన్ని గ్రామీణ స్థాయి వరకు తీసుకువెళ్లే ఉద్యోగులము మేము. అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మానస పుత్రిక అయిన డ్వాక్రా సంఘాల బలోపేతానికి మేము ఎంతో కృషి చేస్తున్నాము. అయినప్పటికీ మాకు ఎలాంటి ఆర్థిక, ఉద్యోగ భద్రతలు లేవు. ఆరోగ్య, ప్రమాద బీమాలు కూడా సరిగా లేవు. మా సమస్యలను మీకు వివరిస్తున్నాము. దయచేసి మా సమస్యల పరిష్కారానికి తమరు సహకరించాలని ప్రార్థిస్తున్నామన్నారు. మేము గత 20 సంవత్సరములుగా కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా పని చేస్తున్నామని మాకు ఎలాంటి పదోన్నతులు ఇతర సదుపాయాలు కల్పించబడలేదన్నారు. అందువల్ల తమకు పదోన్నతులు ఇతర అవకాశాలను కల్పించాలని కోరారు. ముఖ్యంగా మాకు ఉద్యోగ భద్రత లేదు. మా ఉద్యోగాలు రెగ్యులరైజేషన్ చేయవలెను. ఆరోగ్య బీమాను ప్రస్తుతం 10 లక్షలకు అమలు చేస్తున్నారు. దానిని 50 లక్షలకు అమలు చేయాలి. అలాగే ప్రమాద బీమాను 50 లక్షల వరకు కల్పించాలి. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ శాఖలకు అమలు చేస్తున్నట్లుగా ఉద్యోగ పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలి. మా సమస్యలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి మాకు న్యాయం చేయాలని వారు కోరారు.

# యువత పోరు పోస్టర్స్‌ను ఆవిష్కరణ

### వైఎస్ఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి, ఏపీ మాజీ డిప్యూటీ సిఎం అంజాద్ భాష, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ



కడప, మేజర్‌న్యూస్: కూటమి ప్రభుత్వ కూసాలు కదిలే రీతిలో యువత పోరును జయప్రదం చేయాలని వైయస్ఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాషా, బద్వేల్ శాసనసభ్యురాలు డాక్టర్ సుధమ్మ విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరంలోని వైయస్సార్ జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని చెల్లించకుండా.. విద్యార్థులను చదువుకు దూరం చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం తక్షణమే కపట నాటకాలు కట్టి పెట్టాలని ఆయన హెచ్చరించారు. లేదంటే విద్యార్థులు తిరగబడడం ద్వారా తలెత్తే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈనెల 12వ తేదీన వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ విద్యార్థి నేతలతో సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం చేయడం వల్ల వారు చదువులు ఆపాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని పర్యవసానం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. పిల్లల ఫీజులకు అవసరమైనంత డబ్బులు లేక తల్లిదండ్రులు అప్పులు చేయడం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇది మంచి పరిణామం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 2018-19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం బకాయి పెట్టి పోయిన రూ. 1,800 కోట్ల రూపాయలను వైసీపీ ప్రభుత్వమే చెల్లించిన వాస్తవాన్ని గుర్తుకు చేశారు. అదే విధంగా 2023-24లో ఎన్నికల కోడ్ కారణంగా ఏర్పడిన బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత నుంచి ప్రస్తుత కూటమి ప్రభుత్వం పక్కకు తప్పుకోవడం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. ఆ బకాయిలతో కలిపి, ఇప్పటి వరకు రూ. 3,900 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఆయన వివరించారు. లక్షల మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంలో ఇంకా జాప్యం చేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే విషయమై మార్చి 12వ తేదీన జరుగనున్న యువత పోరును విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి గారు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్ గారు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయి దత్త, కడప నగర విద్యార్థి విభాగం అధ్యక్షుడు శివారెడ్డి, విద్యార్థి నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కర్మలవారిపల్లెలో ఘనంగా కాశిరెడ్డి నాయన స్వామి విగ్రహ ప్రతిష్ఠ మరియు ధ్వజ స్తంభ కార్యక్రమము



జమ్మలమడుగు మేజర్‌న్యూస్: కాశిరెడ్డి నాయన విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆరు వేలకు పైబడి భక్తులు,ప్రజలు, అన్నధానం కార్యక్రమములో పాల్గొన్నారు.అన్నధానం కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించిన ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి.కాశిరెడ్డి నాయన స్వామి సన్నిధిలో మండల వ్యవసాయ అధికారి.మారెడ్డి.వెంకట క్రిష్ణారెడ్డి.మైలవరం మండలం కర్మలవారిపల్లె గ్రామంలో శ్రీ అవధూత కాశిరెడ్డి నాయనకు పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా గుడి కమిటీ పెద్దలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ వాసి మరియు ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శనం చేసుకొని ఆశీస్సులు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులతో కలసి కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే వ్యవసాయ అధికారి మారెడ్డి.వెంకట క్రిష్ణారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారికి పూజలు నిర్వహించి, ఆశీస్సులు పొంది తదుపరి అన్నధానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించినట్లు తెలిపారు.గ్రామంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో, పాడి పంటలతో, విరజిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు.గ్రామములోని ప్రజలు అందరు ఆడ ,మగ బేధం లేకుండా సమష్టిగా కలసి మెలసి అన్నధానం కార్యక్రమంలో పాల్గొని వచ్చిన భక్తులకు, ప్రజలకు అన్న ప్రసాదం వడ్డించారు.గ్రామంలో ప్రతి ఒక్కరు గుడి నిర్మాణం మొదలు పుట్టి నప్పటి నుండి గుడి ప్రా రంభోత్సవ కార్యక్రమము వరకు గ్రామంలోని ప్రతిఒక్కరు ఏదో ఒక రకంగా సహాయ, సహకారాలు అందించారు. తదుపరి గుడి నిర్మాణంలో భాగస్వా ములైనటు వంటి గుడి కమిటీ పెద్దలకు చిన్న కొమెర్ల పకృతి వ్యవసాయ సిబ్బంది శాలువా,పూల దండలు వేసి సన్మానం చేశారు. గుడి అవరణంలో చెక్క భజన కార్యక్రమం నిర్వహించి కాశిరెడ్డిస్వామి భక్తి పాటలతో భక్తులను అలరించారు.అన్నదాన కార్యక్రమంలో ఆరు వేల మందికి పై బడి వచ్చినట్లు కమిటీ పెద్దలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యమ్.సి.పుల్లారెడ్డి, కమిటీ పెద్దలు టి.చిన్న లక్ష్మీ రెడ్డి,వై.గోపాల్ రెడ్డి, టి.సహా దేవ రెడ్డి మరియు వ్యవసాయ అధికారి సతీమణి యమ్.రాధ, కూతురు యమ్.వి.దివ్య శ్రీ,కుమారుడు యమ్.వి.నిహల్ రెడ్డి, యన్ కుమార్ రెడ్డి, వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు,భక్తులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద ఆర్యవైశ్యులకు పింఛన్ పంపిణీ




## కూరగాయల మార్కెట్‌కు శ్రీరంగనాథ స్వామి నామ పలకం ఏర్పాటు

పులివెందుల మేజర్ న్యూస్ పులివెందుల శ్రీ రంగనాథ స్వామి ఆలయ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్ కు శ్రీరంగనాథ స్వామి వారి నామ పలకాన్ని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. గతంలో ఈ నామ ఫలకం స్థానంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును పెట్టడం జరిగింది .దీంతో టిడిపి ,బిజెపి, కాంగ్రెస్ హిందూ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇది ఒక పెద్ద ఇష్యూగా మారింది. దీంతో మారిన ప్రభుత్వ నేపథ్యంలో టిడిపి నాయకులు రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఈ అంశాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పేరు మార్పును సంబంధించిన బోర్డును ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకున్నారు. పులివెందుల ప్రజల మనోభావాల మేరకు వైసిపి నాయకులు వైయస్ మనోహర్ రెడ్డి కూడా కౌన్సిల్లో పేరు మార్పిపై తగిన చర్యలు తీసుకున్నారు. మొత్తానికి పులివెందుల కూరగాయల మార్కెట్‌పేరును మారుస్తూ మున్సిపల్ కమిషనర్ రాముడు బోర్డును నూతనంగా ఏర్పా టు చేయించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు హిందూ సంఘ నేతలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## కార్యకర్తను పరామర్శించిన తెదేపా నాయకులు



బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్ : బ్రహ్మంగారి మఠం మం డలం రేకులకుంట గ్రామానికి చెందిన గంగన్న గారి మనవడు ఇటీవల కాలంలో యాక్సిడెంట్ అయ్యి ప్రమాదానికి గురికాగా విషయం తెలు సుకున్న తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి యు వ నాయకులు ఖానాల మల్లికార్జున్ రెడ్డి, సాంబశివారెడ్డి, తెదేపా నాయ కులు మేకల సుధాకర్,పూటలా శివ,పూజ శివ యాదవ్, రామాం జనేయులు నాయుడు,నాగయ్య, మస్తాన్, గంగరాజు, సూరి,చంద్ర,నాగేంద్ర, వారి నివాసానికి చేరు కొని పరామర్శించి పార్టీపరంగా వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు త్వరగా కోలుకోవాలని వారు ఆశించారు.

బద్వేల్ టౌన్ మేజర్ న్యూస్ బద్వేలు పట్టణ అవోపా వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పేదలైన ఆర్యవైశ్యులకు పెన్షన్ కార్యక్రమము అల్పాహార విందు హైదరాబాదుకు చెందిన రెక్సర్ ఫార్మా కంపెనీ వారి సహకారంతో ఉచిత మందుల పంపిణీ దాతల సహకారంతో ఉచిత హెూమియో క్యాంపును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రోజు ఈ కార్యక్రమానికి బద్వేల్ అవోపా అధ్యక్షులు నూకల రెడ్డయ్య ప్రధాన కార్యదర్శి సివి నాగేశ్వర రావు ఆర్థిక కార్యదర్శి తులసి సుబ్రహ్మణ్యం గౌరవ సలహాదారులు పైడిమరి సుబ్రహ్మణ్యం సహాయ కార్య దర్శి కార్తీక్ మహిళా మండలి అధ్యక్షురాలు ఎస్ మాధవిలత ఉపాధ్యక్షురాలు సుప్రజా ప్రధాన కార్యదర్శి వాణి స్వీకర్ స్వర్ణ అవూపా సభ్యులు విశ్వనాథం శ్రీరాములు పెన్షన్ దారులు బద్వేలు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయడం జరిగింది. ఈ రోజు అల్పాహారం విందును ఏర్పాటు చేసిన వారు కీర్తి శేషులు పత్తి శ్రీనివాసులు జ్ఞాపకార్థము వారి పద్మావ



తమ్మ కుమారులు సురేష్‌బాబు నాగేంద్ర ప్రసాద్ మధుసూదన్‌రావు వారి కోడళ్ళుతో పాటు కుటుంబ సభ్యులు రాయవరం మహాలక్ష్మి వారి భర్త సురేష్ బాబు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయటం జరిగింది తదనంతరం ఉచిత హెూమియో క్యాంపు నిర్వహించడం జరిగింది. ఇట్లు బద్వేల్ అవోపా అధ్యక్షులు నూకల రెడ్డయ్య ప్రధాన కార్యదర్శి సివి నాగేశ్వరరావు ఆర్థిక కార్యదర్శి తులసి సుబ్రహ్మణ్యం అవోపా సభ్యులు.

## టెన్త్ క్లాస్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం




కలసపాడు మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన కలసపాడు లోని ఎస్ కే ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు విద్యా సంవత్సరం ముగిసినందున విద్యార్థులకు వీడ్కోలు సమావేశంలో ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆదివారం కలసపాడు లోని ఎస్ కె మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు విద్యనభ్యస్తున్న టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఫేర్వెల్ పార్టీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి యస్ కే మస్తాన్ వలీ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో విద్యను అభ్యసించిన విద్యార్థులందరూ సమయస్ఫూర్తితో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయ బృందం విద్యార్థుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కష్టపడి విద్యార్థుల ఉన్నత ఆశయానికి ఎంతో కృషి చేశారని ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఎస్ అండ్ కె మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు ఉపాధ్యాయ బృందం ఎంతో కృత నిశ్చయంతో విద్యార్థుల భవిష్యత్తుకు పునాదివేశారని ఎస్ అండ్ కే ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఎస్ కే కళాశాల కరస్పాండెంట్ షారోజ్ మాట్లాడుతూ హార్డ్ వర్క్ క్యారెక్టర్ ఫీలింగ్స్ విద్యార్థుల్లో కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో హెడ్మాస్టర్ ఎస్ భాషు, ఏ ఓ ఖాద్రీ, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

## ఏపీఎస్ఆర్టీసీవారి బస్సు సేవలను సద్వినియోగం చేసుకోండి..!

### బద్వేల్ ఆర్టీసీ డిఎం. నిరంజన్

**బద్వేల్ మేజర్‌న్యూస్:** బద్వేలు ఆర్టీసీ డిపో స్పెషల్ సర్వీసులు ఇంటర్ మొదటి సంవత్సరం ముగిస్తుండడంతో దూర ప్రాంతాల నుండి విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బద్వేలు ఆర్టీసీ డిపో స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేశామని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఆయన ప్రతిక ప్రకటనలో తెలిపారు. 13.3.25 రోజు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగింపు సందర్భంగావిజయవాడ నుండి కడపకు (సర్వీస్ నెంబరు. 95467 19.30 కు, సర్వీస్ నెంబరు 95283 20.00 గంటల కు మరియు సర్వీస్ నెంబరు 95350 20.30 కు విజయవాడ నుండి రిజర్వేషన్ ఓపెన్ చేయడము జరిగిందని, బద్వేల్ రిజర్వేషన్ కౌంటర్ నుండి రిజర్వేషన్ చేసుకొనే సౌకర్యం కల్పించామని, కావున విజయవాడ నుండి కడపకు రిజర్వేషన్ కావలసిన వారు బద్వేల్ రిజర్వేషన్ కౌంటర్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చునన్నారు. రిజర్వేషన్ కౌంటర్ నెంబర్ 8886090136 భాస్కర్‌కు ఫోన్ పే ద్వారా కూడా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. మీరు రిజర్వేషన్ చేస్తున్న టికెటును వాట్సప్ ద్వారా టికెట్ పంపుతా మన్నారు. ఈ అవకాశాన్ని బద్వేల్ మరియు పరిసర ప్రాంత ప్రజలు, పొరుమామిళ్ళ ప్రజలు వినియోగించుకోవచ్చునన్నారు. బద్వేలు ఆర్టీసీ డిఎం తెలిపారు. వివరాలకు 9959225779. ఫోన్ నెంబర్ సంప్రదించాలన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి శాశ్వత కళ్యాణమునకు లక్ష రూపాయలు విరాళం



**బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్:** భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞానం సృష్టికర్త ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం ప్రాంగణంలో జరుగు గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మాస కల్యాణ మహెూత్సవమునకు బాపట్ల జిల్లా కుంచలవారిపాలెం వాస్తవ్యులు అక్కల ఆంజనేయులు రెడ్డి ధర్మపత్ని శివగంగా మాఘ శుద్ధ ద్వాదశి రోజున జరుగు కళ్యాణమునకు 1,05,116 రూపాయలు విరాళమును చెల్లించినట్లు ఆలయ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలియజేశారు. ఎవరైనా భక్తులు విరాళం చెల్లించదలచిన వారు బ్యాంకు ద్వారా కానీ లేదా నేరుగా మఠం కార్యాలయం వద్ద గాని విరాళమును చెల్లించి తగు రసీదును పొందగలరని మరిన్ని వివరములకు 9502986023 నెంబరు ను సంప్రదించగలరని తెలిపారు.

# అమ్మవారికి సేవ చేయడమే లక్ష్యం

### ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్

### అట్టహాసంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం





వేంపల్లె మేజర్ న్యూస్:స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం అమ్మవారికి సేవ చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ వెల్లడించారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవి కళ్యాణ మండపం, ఆర్యవైశ్య మహిళా మండలి సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధితో పాటు సంఘం నియమ నిబంధనలకు లోబడి పని చేస్తామన్నారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు రాయవరం సురేంద్ర, ఉపాధ్యక్షుడు దొంతు సుబ్బారావు, కార్యదర్శి సత్యనారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బారావు, ఉపాధ్యక్షులు నిరంజన్, వీరేంద్రనాథ్, వంశీ, కార్యదర్శి దొంతు సతీష్, వాసవి కళ్యాణ మండపం అధ్యక్షుడు కామిశెట్టి సతీష్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ, ఉపాధ్యక్షులు నిచ్చెనమెట్ల మాధవి, కాంభోజి నిర్మల, కార్యదర్శి వడ్లకుంట మృధుల తదితర కార్యవర్గ సభ్యులు నూతన ప్రమాణ స్వీకారం చేశారు.

# పెద్ద కుడాల గ్రామంలో వైభవంగా శ్రీ గంగమ్మ తల్లి జాతర





లింగాల మేజర్ న్యూస్ : లింగాల మండలంలోని పెద్ద కుడాల గ్రామంలో ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తున్న శ్రీ గంగమ్మ తల్లి తిరుణాల శివరాత్రి అనంతరం రెండవ ఆదివారం అనగా ఈ సంవత్సరం ఆదివారం శ్రీ గంగమ్మ తల్లి తిరుణాల అంగరంగ వైభవంగా కొనసాగింది సాయంత్రం ఆ గ్రామంలో ఒక పెద్ద పండుగ లాగా రథ మహెూత్సవంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రథోత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే ఆ గ్రామంలో గంగమ్మ తల్లిని ఊరేగింపుగా అంగరంగ వైభవంగా సాగింది. గంగమ్మ తల్లి జాతరలో శ్రీ గంగమ్మ తల్లి దర్శించుకునేందుకు లింగాల టిడిపి నాయకులు దేవరెడ్డి సంజీవరెడ్డి వారి సతీమణి తో ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ జాతరలో లింగాల మండలం సింహాద్రిపురం మండలం తొండూరు మండలం పులివెందుల మండలం నుండి పెద్ద ఎత్తున ఈ తిరుణాలకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

### జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా

పులివెందుల మేజర్ న్యూస్ పులివెందుల పట్టణంలోని స్థానిక జెండా మాను వీధిలోని ఉర్దూ కళాశాలలో విజయ కంటి వైద్య శిబిరం ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించడం జరిగిందని జిల్లా వైసిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూరుల్లా మాట్లాడుతూ ఒక దశ తర్వాత కంటి సమస్యలు ఏర్పడడం సహజమని వాటిని దృష్టిలో ఉంచుకుని సాధారణ ప్రజలను పరిగణ లోనికి తీసుకొని ఉచిత కంటి సేవలను అందించే ప్రయత్నంలో భాగంగా జెండా మాను వీధిలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 120 మంది స్త్రీలు ఉచిత పరీక్షల్లో పాల్గొనగా వారికి అవసరమైన మేర వైద్య సలహాలు అందించి కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించి అవసరమైన ఔషధాలను ఉచితంగానే అందించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమా నికి సహృదయంతో ముందుకు వచ్చి సేవలందించిన విజయ కంటి వైద్యశాల యాజమాన్యానికి పులివెందుల పట్టణ ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అలీ ఎంపీటీసీ ఎర్రిపల్లి. షబ్బీర్ ఆతిక్ మసీద్ ముత్తవల్లి. డోనాల్డ్ రఫీఅహ్మద్ నూరు పాల్గొన్నారు



## వైసిపి వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వీరాంజనేయులు

పులివెందుల మేజర్ న్యూస్ వైయస్సార్ కడప జిల్లా పులివెందుల పట్టణానికి చెందిన గంగల వీరాంజనేయులు అను నాకు వైఎస్ఆర్సిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండవసారి నియమించడం పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి కి జిల్లా అధ్యక్షుడు పి రవీంద్ర రెడ్డికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పులి వెందుల మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డికి రాష్ట్ర కార్యదర్శి దేవి రెడ్డి శివశంకర్ రెడ్డికి వైఎస్ఆర్సిపి వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ కి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ పదవి రావడానికి సహకరించిన మిత్రులకు శ్రేయోభిలాషులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ నాకు ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని దేవదేవుని సాక్షిగా తెలియజేస్తున్నాను అని తెలిపారు

# భవిష్యత్తుకు పదితో చక్కటి ప్రణాళిక వేసుకోండి

### బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి




జమ్మలమడుగు మేజర్ న్యూస్ : భవిష్యత్తుకు చక్కటి ప్రణాళిక పదవ తరగతి మార్కులతోనే వేసుకోవాల్సి ఉంటుందని బాలజిహైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక బాలజి హైస్కూల్లో తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ భయాన్ని వదిలి ప్రతి సబ్జెక్టును ఇష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రుల కోసమో, ఉపాధ్యాయుల కోసం చదవద్దని మీకోసం, మీ భవిష్యత్ కోసం చదవాలన్నారు. గతంలో 590 క్రాస్ చేసిన విద్యార్థికి ఆ సంవత్సరం ఫీజును తిరిగి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ఏడాదిలో టౌన్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి పూర్తి గా ఫీజు వెనకకు ఇస్తానని తెలిపారు. పదిలో గ్రేడ్లలో కానీ మార్కులల్లో కానీ మన స్కూల్ విద్యార్థులు సాధించిన తర్వాతనే మిగతా విద్యార్థులు ఉంటారన్నారు. ఏవో కే.వి.వి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎదిగే కొద్ది ఒదిగి ఉండాలన్నారు. సమాజంలో విలువలు పాఠశాల స్థాయిలోనే నేర్చుకుంటారని వాటిని జీవితాంతం పాటించాలన్నారు. మీరు సాధించే ఉత్తమమైన మార్కులు మీ తల్లిదండ్రులను, మమ్మల్ని సంతృప్తి మాత్రమే పర్చుతాయని మీకు మాత్రం జీవితానికి బాటలు వేస్తాయన్నారు. అనంతరం, భరత్‌కుమార్, ప్రధానో పాధ్యాయులు సూర్యమిత్ర, సీనియర్ ఉపాధ్యాయులు ఖాసీం, ప్రిన్సిపాల్ శిరీష పదవ తరగతి ఉపాధ్యాయులు ప్రసంగించారు. పాఠశాలలోని విద్యార్థుల నుంచి సమాజ సేవలో బాగస్వాములై నేనున్నాను సేవ చేయ డానికి అని మే ఐ హెల్ప్ యు ఫౌండేయన్‌ను స్థాపించి ముందుకు సాగు తున్న ఆ సంస్థ చైర్మన్ మోరె లక్ష్మణ్ రాకకు రూ.15000 వితరణ చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం లో సీనియర్ ఉపాధ్యాయులు సత్యానందం, ప్రసాద్, భాష పాల్గొన్నారు.

# రోడ్డుపైనే చెత్తాచెదారం దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

### అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినను ఫలితం శూన్యం



పోరుమామిళ్ల మేజర్ న్యూస్ పోరుమామిళ్ల పట్టణంలోని 14వ వార్డు కొత్త వీధి మెయిన్ రోడ్డులో పంచాయతీ అధికారులు చెత్త తొట్టిని ఏర్పాటు చేయక పోవడం వల్ల ఆ చుట్టుపక్కల ఉండే వీధి ప్రజలు చెత్త, ప్లాస్టిక్ కవర్లు మరియు కుళ్ళిన ఆహార పదార్థాలు మొదలైనది రోడ్డుపైనే వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రోడ్డు గుండా నిత్యం ప్రజలు రద్దీగా తిరుగుతూ ఉంటారు. సెలవు దినాలలో రద్దీ తక్కువ ఉంటుంది. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాల యాలు ఉన్నప్పుడు ఈ రోడ్డు మార్గాన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, స్కూల్ బస్సులు రద్దీగా తిరుగుతూ ఉంటాయి. చెత్తా చెదారం కుళ్ళిన ఆహార పదా ర్థాలు రోడ్డుపైనే వేయడం వల్ల దుర్వాసనతో ప్రజలు ఈ రోడ్డు వైపు తిరగాలంటే భయపడుతున్న పరిస్థితి ఏర్పడింది. ప్లాస్టిక్ కవర్లలో అక్కడ వేసిన ఆహార పదార్థా లను తినుటకు ఆవులు, కుక్కలు, పందులు ఆహార పదా ర్థాలను రోడ్డుపైకి లాగి చల్లా చెదురు చేసి ఆ ప్రాంత మంతా గలీజు చేస్తూ ఉంటాయి.

కుళ్ళిన ఆహార పదార్థాలను రోడ్డు పై వేయడం వల్ల ప్రజలకు వ్యాధులు వ్యాపించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక్కడ చెత్త తొట్టిని ఏర్పాటు చేయమని అధికారుల దృష్టికి తీసుకు వెళుతున్నను ఫలితం శూన్యం అంటున్నారు. ఇప్పటికైనా పంచా యతీ అధికారులు ఈ సమస్యపై స్పందించి ఆ ప్రదేశంలో చెత్త తొట్టిని ఏర్పాటు చేస్తారో లేదో వేచి చూద్దాం!



## సీమంతం వేడుకలలో వైయస్ మనోహర్ రెడ్డి

పులివెందుల మేజర్‌న్యూస్ పులివెందుల పట్టణ పరిధిలోని ఐటిఐ కాలేజీలో పనిచేస్తున్న సాయి కూతురు సీమంతపు వేడుకలలో వైయస్ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు ఈ కార్యక్రమాల్లో భాగంగా ఐటిఐ సాయి ప్రత్యేక ఆహ్వానం మేరకు సీమంతం వేడుకలకు మున్సిపల్ ఇంచార్జి వై. ఎస్. మనోహర్ రెడ్డి హాజరై ఐటిఐ సాయి కూతురు సుఖప్రదాయంతో డెలివరీ అయ్యి తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ కన్వీనర్ హల్ గంగాధర్ రెడ్డి, వైస్ చైర్మన్ హఫీజ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రమౌళి, కౌన్సిలర్ కోడిరమణ, ఖాదర్, నాయకులు మల్లికార్జున రెడ్డి, లక్షనారాయణ రెడ్డి, నాగరాజు, రవి, పద్మనాభరెడ్డి, హరి, కోఆప్షన్ చంద్రమౌళి, చిన్న పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ ఏపీ జాయింట్ సెక్రటరీగా ముత్యాల ప్రసాద్ రావు



పోరుమామిళ్ల మేజర్ న్యూస్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ముత్యాల ప్రసాద్ రావు నం నియమించిన వరల్డ్ చైర్మన్ డాక్టర్ నేమ్ సింగ్ ప్రేమి నియమించడం జరిగినది. ఈ సందర్భంగా ముత్యాల ప్రసాద్‌రావు మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నందుకు సేవలను గుర్తించి నాకు నియమించడం జరిగిందన్నారు. సమస్యలను తన వంతు బాధ్యతగా అధికారుల, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానన్నారు. నాకు ఇచ్చిన ఈ బాధ్యతను అంకితభావంతో సమస్యల పరిష్కారం కొరకు పని చేస్తానని, అలాగే నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## నేడు సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

### డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప,మేజర్‌న్యూస్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం సభా భవన్ లో నిర్వహిస్తు న్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకో వచ్చునన్నారు.

**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం..**

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10.00 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రతేది..!

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య



కడప – మేజర్ న్యూస్ కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని అందుకు నిదర్శనం వేంపల్లి లో జరిగిన సంఘటనని అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య మండిపడ్డారు. మగవారు ఇంటిలో లేని సమయంలో మహిళలు పసిపిల్లలు ఉన్న ఇంటిపై తెలుగుదేశం పార్టీ నాయకుడు జీవీ రమణ అతని అనుచరులు మారణాయుధాలు, పెట్రోల్ తో దాడికి పాల్పడడం హేమమైన చర్యని అన్నారు. కూటమి ప్రభుత్వంలోని పెద్దలు చెప్పేటివన్నీ శ్రీరంగనీతులు దూరేది దొమ్మర గుడిసెలు అన్నట్లు కింది స్థాయి నాయకుల తీరు ఉందని ఆయన మండిపడ్డారు.. జి.వి రమణ ఆయన అనుచరులు ఇడుపులపాయ లోని ట్రిబుల్ ఐటీ లో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు వేయించుకున్నారని, డాక్రా మహిళల పేరు తో క్యాన్ టిన్ పొంది ప్రైవేట్ వారికి లక్షల రుపాయల కమీషన్ కు అమ్ముకున్నారని పెర్కొన్నారు. అనధికారికంగా స్టాల్స్ ఏర్పటు చేసిన వారు , అక్రమం గా ఉద్యోగాలు పొందిన వారు జివి రమణా అనుచరులు గా ఉండి మహిళపైన, పిల్లలపైన దాడికి పాల్పడిన సంఘటన కూటమి ప్రభుత్వంలో మహిళల పట్ల గౌరవాన్ని తెలియజేస్తున్నాన్నది అన్నారు. మహిళాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.. జర్నలిస్ట్ గా వృత్తిపర మైన విభేదాలు ఉంటే ఆయన లేనప్పుడు మహిళా కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడటం ఏంటని తెలిపారు. ఈ సంఘటన పై హెూంమంత్రి కి పిర్యాదు చేస్తామని తెలిపారు. దీని వెనుక రాజకీయ కుట్ర ఉందనే అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్య సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు భూమిరెడ్డి విజయభారతి కి సిపిఐ అండగా ఉంటుందని తెలిపారు.

## సమాజానికి ఉపయోగపడే గొప్ప పౌరులుగా ఎదగాలి

### ఎంఈఓ జాఫర్ సిద్దిక్



వేంపల్లె మేజర్ న్యూస్:పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాసి మంచి ఫలితాలు సాధించి భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే గొప్ప పౌరులుగా ఎదగాలని మండల విద్యాశాఖ అధికారి సిఎస్ జాఫర్ సాదిక్ అన్నారు. ఆదివారం స్థానిక ఉషా కిరణ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఓ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ విద్యార్థి జీవితానికి మార్కులు ఒక్కటే ప్రామాణికం కాదని చదువుతోపాటు జీవితానికి అవసరమైన జ్ఞానసమపార్జన చేయాలని తద్వారా సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఆయన ఉద్భోదించారు. అనంతరం పాఠశాల వ్యవస్థాపకులు గుజ్జుల కృష్ణారెడ్డి పదో తరగతి విద్యార్థులు పరీక్షలు వ్రాసేటప్పుడు పాటించాల్సిన మెలుకువలను తెలియ జేశారు. పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కోరారు. అలాగే సమాజాన్ని ప్రభావితం చేసే గొప్ప వ్యక్తులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అజాద్‌ను అభినందించిన ట్రిపుల్ ఐటి డైరెక్టర్



వేంపల్లె మేజర్‌న్యూస్:ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సిఈసి విభాగంలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి అజాద్‌ను ఆదివారం డైరెక్టర్ కుమార స్వామి గుప్తా అభినందించారు. బిటెక్ విద్యార్థినైనా అజాద్ ప్రతిష్టాత్మకమైనా గూగుల్ సమ్మర్ అఫ్ కోడ్ ఇంటర్న్‌షిప్ ను విజయవంతంగా పూర్తి చేసినట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా తెలిపారు. విద్యార్థి అజాద్‌ను అభినందించిన వారిలో పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, సిఎస్ఈ హెచ్ ఓడి చల్లా రత్నకుమారి, అకాడమిక్ డీన్ రమేష్ కైలాష్ ఉన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు




కడప మేజర్ న్యూస్ మహిళా సాధికారితతోనే దేశాభివృద్ధి కలసాకారమవుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి సతీమణి పోచిమరెడ్డి అరుణమ్మ తెలిపారు. శనివారం ఈ సందర్భంగా కడప నగరంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు టిపి.వెంకటసుబ్బమ్మ, నగగర మహిళా అధ్యక్షురాలు బండి దీప్తి గారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వైసీపీ మహిళా ప్రతినిధులు దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి మహిళా లోకానికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి పోచిమరెడ్డి అరుణమ్మ, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగంలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలను ఆది పరాశక్తులుగా భావిస్తామన్నారు. సమాజం మహిళలకు ఉన్నత స్థానం కల్పించిందన్నారు. చరిత్రను పరిశీలిస్తే ఎన్నో పదవుల ద్వారా మహిళలు సేవలు అందించారన్నారు. కానీ కాలక్రమంలో పితృస్వామ్య వ్యవస్థ వచ్చిన తర్వాత మహిళలకు కొంతమేర ప్రాధాన్యత తగ్గినా గత కొంతకాలంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమ హక్కులను కాపాడుకునేందుకు కృషి చేయడం జరుగుతోందన్నారు. రాబోయే కాలంలో మహిళలకు తగిన గుర్తింపు గౌరవాలు లభించగలమని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. నీతి నిజాయితీగా, నిసత్తువుగా పనిచేసి మహిళామణులు ఆదర్శనీయంగా నిలువాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌భాష, వైసీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డితోపాటు ఇతర మహిళా నాయకులు సరస్వతి దేవి, కృష్ణవేణి, జ్యోతి, మల్లి, తులసమ్మ, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీ పత్రా నాయుళ్ళ అన్నదాన సదనం. కళ్యాణ మండపానికి ఎంపీపీ చల్లా గంగాదేవి విరాళం





వేముల మేజర్ న్యూస్: వైఎస్ఆర్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో అత్యంత సుందరంగా పత్రా కులస్తులు నిర్మిస్తున్న పత్రానాయుళ్ళ అన్నదాన సదనం కల్యాణ మండపం నిర్మాణానికై వేముల మండలం బచయ్య గారిపల్లికి చెందిన కీర్తిశేషులు చల్లా రామ సుబ్బమ్మ భర్త వేముల మాజీ సర్పంచ్ కీర్తిశేషులు చల్లా పెద్ద వెంకటయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు కోడలు వేముల మండలం ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ, చిన్న కుమారుడు కోడలు చల్లా కృష్ణవేణి శ్రీనివాసులు వీరి మనవాళ్ళు మనవరాలు చల్లా ఉమా మహేశ్వరి సుదర్శన్ బాబు, చల్లా భార్గవి శివరమకృష్ణయ్య , చల్లా గౌతమి సునీల్ కుమార్ (ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పత్రా ప్రగతి మరియు సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ),చల్లా అరుణ్ కుమార్, చల్లా శ్వేత కుటుంబ సభ్యులు విరాళంగా లక్ష రూపాయలను ప్రకటించి మొదటగా 50వేల రూపాయలను ఆదివారం ఉదయం వేములలో కమిటీ అధ్యక్షుడు తిప్పన బ్రహ్మయ్య చేతికి నగదును అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆంధ్రప్రదేశ్ పత్రా నాయుళ్ళ అన్నదాన సదనం కళ్యాణ మండపంకి తమ వంతు సహాయ సహకారాలు అందజేయాలని చూసించారు. ఈ కార్యక్రమంలో పత్రా ప్రగతి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పెద్దపోతుల ఆంజనేయులు, అధ్యక్షుడు పెద్దపోతుల హనుమంతరాయుడు,సత్యసాయి జిల్లా అధ్యక్షు లు రామాంజనేయులు,ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప, ఎర్రగుంటపల్లె సర్పంచ్ యుగంధర్,వెంకట రమణ మరియు కదిరి పత్రా కులస్తులు పాల్గొన్నారు.

# ఛలో పిఠాపురంకు తరలిరండి

### కడప పార్లమెంట్ సమన్వయకర్త తాతంశెట్టి నాగేంద్ర



కడప, మేజర్‌న్యూస్ : కడప జనసేన నాయకులు జీ.వీ. రమణ, తుంగ రమణయ్య ఆధ్వర్యంలో పండ్రా రంజిత్ కుమార్ అధ్యక్షతన కడప పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త తాతంశెట్టి నాగేంద్ర ముఖ్య అతిథిగా కడప జిల్లా జనసేన సమన్వయ సమావేశం దేవుని కడప కాల్వ ఫంక్షనలో ఏర్పాటు చేసి కార్యకర్తలకు ఛలో పిఠాపురం జనసేన ఆవిర్భావ సభ గురించి దిశ నిర్దేశం చేశారు. మొదట సంధ్య సర్కిల్ నుంచి దేవుని కడప వరకు రాష్ట్రంలోనే ప్రప్రదంగా జనసేన ఆవిర్భావ సభ బైకు ర్యాలీ కడపలో భారీ ఎత్తున నిర్వహించి తిరుమల తొలి కడప దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి గోత్రనామాలతో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఛలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తాతంశెట్టి నాగేంద్ర గారు మాట్లాడుతూ పార్టీ నేతలు, కార్యకర్తలు హలో కడపలో పిఠాపురంతో కథం తొక్కడాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. 14వ తేదిన కోట్లాది మంది ప్రజల్లో కడప ప్రత్యేకతను చాటుకునేలా శ్రేణులు ముందుకు రావడం హర్షణీయమని తెలిపారు. కడపలో ఇంత పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించేందుకు కృషి చేసి ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, ఇదే ఉత్సాహంతో పిఠాపురంలో జరిగే పార్టీ ఆవిర్భావ సభలో పాల్గొనాలన్నారు. ఈనెల 13న జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బయలుదేరే బస్సుల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని మనందరి అభిమాన నాయకుడు పవన్ కళ్యాణ్‌కి సంఘీభావం తెలపాలన్నారు. అనంతరం పార్టీ నేతలు జి. వి రమణ, తుంగ రమణయ,ఇతర నేతలు మాట్లాడుతూ పిఠాపురం సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలి వస్తాయని, ఇందుకు అన్ని విధాల తోడ్పాటు అందిస్తున్న తాతంశెట్టి నాగేంద్ర గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ వైస్ చైర్మన్ ఉదయశ్రీ, సీనియర్ నాయకులు వేణు రెడ్డి, నాగార్జున, హరీష్, శివ కళ్యాణ్, అబ్బన్న గారి రాజగోపాల్, మాలె శివ, గజ్జల సాయి, ఉంగరాల విజయ్, తిరుమల శెట్టి సిద్ధార్థ, నాగరాజ్, ఆకుల గోపి, శేషరాయల్, బసెట్టి స్వరూప్, వినయ్, తేజ, సాయికృష్ణ, బాలు, కుమార్ నాయక్, రామ్ సిద్దు, యువరాజ్ రాము, గౌస్ లాజం, దాదా పీర్, జిలాని భాష, అబ్దుల్ మాలిక్, పవన్, కడప పార్లమెంట్ పరిధిలోని జనసేన నాయకుడు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# రేషన్ డీలర్ల పై చర్యలు తీసుకోవాలి : సిపిఐ

### సిపిఐ కార్యదర్శి ప్రసాద్



జమ్మలమడుగు మేజర్ న్యూస్: పట్టణంలోని పేదల కడుపు కొడుతున్న రేషన్ డీలర్ల పై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జమ్మలమడుగు కార్యదర్శి మిడుతూరు ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జమ్మలమడుగు పట్టణంలో పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం కేవలం రెండు మూడు రోజులకే పంపిణీ పూర్తి అయిపోయాయి అని చెబుతూ పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా డీలర్లు బియ్యాన్ని అమ్ముకుంటున్నారని తెలిపారు. గత లో పదవ తారీకు వరకు పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేసేవారని, ఇప్పుడు కేవలం రెండు మూడు రోజులకే రేషన్ దుకాణాలను మూస్తున్నారని ఇదేమని అడిగిన మహిళల పైన పేదల పైన నీ దిక్కు ఉన్నచోట చెప్పుకో అంటూ వారిపై చిందులు తొక్కిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అంతేకాకుండా మరికొన్నిచోట్ల డబ్బులు ఇచ్చి పంపించే పరిస్థితి నెలకొని ఉందని తెలిపారు. మరి కొంతమంది డీలర్లు ఐసిడిఎస్ కు ఇస్తున్నటువంటి ఆయిల్ ప్యాకెట్లను, కందిపప్పు ప్యాకెట్లను మాయం చేసిన సంఘటనలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. అయితే ఇది రెవెన్యూ అధికారులకు తెలిసినా కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైనది కాదని తెలిపారు. జమ్మలమడుగులో రేషన్ మాఫియా దందా రాజ్యమేలుతోందని ఇప్పటికైనా రేషన్ బియ్యం దంధాను అరికట్టాలని లేనిపక్షంలో పేద ప్రజలను కూడగట్టుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వరప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.

# కమలాపురం మున్సిపల్ ఏ.ఈ గా తిరువెంగళప్ప నియామకం

### మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథం



కమలాపురం మేజర్ న్యూస్ కమలాపురం నగర పంచాయతీ నందు మున్సిపల్ అసిస్టెంట్ ఇంజ నీరుగా తిరువెంగళప్పను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తరువులు జారీ చేసింది. గతంలో ఇక్కడ అసిస్టెంట్ ఇంజనీర్ గా పనిచేస్తున్న డి.సురేష్ పదోన్నతి పై డి.ఈ గా పలమనేరుకు బదిలీగా ప్రస్తుతం ప్రొద్దుటూరు మున్సి పాలిటీ నందు అమెనిటీస్ సెక్రటరీగా పనిచేస్తూ కమలా పురం పట్టణంలో జరుగుతున్న పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ పనులను పర్యవేక్షిస్తున్న ఇంచార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్ తిరువెంగళప్పను డిప్యూటేషన్ పద్ధతిపై అదనపు బాధ్యతల మీద మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీరుగా కమలాపురం నగర పంచాయతీకి నియమిస్తూ సూపర్డెంట్ ఆఫ్ ఇంజనీరింగ్ పబ్లిక్ హెల్త్ అనంతపురం వారు ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ లేకపోవడంతో గత కొద్ది కాలంగా అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందని ఇప్పుడు అసిస్టెంట్ ఇంజనీరింగ్ నియామకం వల్ల అభివృద్ధి పనులు తిరిగి కొనసాగుతాయని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ అన్నారు.

# మహిళలకు సమానత్వంవల్ల సమాజాభివృద్ధి సాధ్యం ..!

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



బద్వేల్ మేజర్ న్యూస్ మహిళలకు అన్ని రంగాలలో సమానత్వం కలిపించడం వల్ల సాధికారతతో పాటుసమాజాభివృద్ధి సాధ్యమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, జిల్లా కార్యదర్శి కె.నాగేంద్ర, సాధన ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ సముద్రాల శ్రీనివాసులు, ఐద్వా పట్టణ కార్యదర్శి సి.రత్నమ్మ పలువురు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం బద్వేలులోని స్థానిక సాధన ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పురపాలక సంఘములో పనిచేస్తున్న పారిశుధ్య మహిళా కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం పోరాటం చేసిన ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయమై అంత ర్జాతీయ మహిళా దినోత్సవం అని మహిళ సమానత్వం- సాధిక రతతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు ఇస్తే అభివృద్ధి పథంలో ముందుకు వెళుతున్నారని, వ్యవసాయం నుండి అంతరిక్షం వరకు సకల రంగాల్లోనూ స్త్రీలు సమున్నత స్థానాల్లో విశిష్ట కృషి చేస్తున్నారని, ఉత్పత్తి రంగాల్లో భాగస్వామ్యంతో పాటు సరైన అవకాశాలు ఇస్తేనే మహిళలు అభివృద్ధిని సాధిస్తారు అనడంలో ఎలాంటి సందేహం లేదని, నేటికీ చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం పాలకులు ఇవ్వడం లేదని, మనుస్మృతిని తలకెత్తుకుంటున్న మత శక్తుల రాజ్యంలో మహిళ సమానత్వ పురోగతి అగమ్యగోచరం గానే వుందని, స్త్రీని సరుకు గా చూసే కార్పొరేట్ శక్తుల పెత్తనం మరోవైపు విజృంభిస్తుందని, మహిళల మీద రోజు రోజుకు హింస, వేధింపులు పెరుగుతున్నాయని, మహిళలు పని ప్రదేశంలో లైంగిక వేధింపులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, మహిళలకు పని ప్రదేశాలలో భద్రత కల్పించడం వల్ల పురోగతి సాధ్యమని అన్నారు., ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు పనిచేయకపోతే కుటుంబం గడవలేని పరిస్థితి ఏర్పడిందని, పరిశ్రమలలో, వివిధ ప్రభుత్వ సంస్థలలో మహిళల చేత పనిచేయించుకుంటూ వారికి కనీస వేతనాలు అమలు చేయకుండా గౌరవ వేతనం పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు ఉద్యోగ భద్రత అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వారికి జీతభత్యాలు పెంచాలని, మహిళలను వ్యాపార వస్తువుగా చిత్రీకరించే సినిమాలను, వ్యాపార ప్రకటనలను నిషేధించాలని, మహిళలను ఓటు బ్యాంక్ గా చూడకుండా వారినీ ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో సమాన అవకాశాలు ఇచ్చి అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు యువరాజు, రాజు, బాదుల్లా, మహిళ కన్వీనర్ గురుదేవి, కో కన్వీనర్లు ఫాతిమా, నాగేశ్వరి, ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు గంప అనంతమ్మ, పట్టణ నాయకురాళ్లు నాగమ్మ, గంప లక్ష్మమ్మ, వెంకటసుబ్బమ్మ, సిఐటియు పట్టణ నాయకులు హరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

పులివెందుల రూరల్ మేజర్ న్యూస్ పులివెందుల ఉలిమెల్ల లేక్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంసిద్ సతీష్ రెడ్డి స్కూల్, వేంపల్లిలి వారి చిన్నరులచే శ్రీ శబరిష్ డ్యాన్స్ మాష్టర అధ్వర్యంలో వారి చిన్నారులచే జానపద, శాస్త్రీయ సినిమా పాటలకు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు మరియు టైక్వాండో ప్రదర్శన నిర్వహించారు. పుష్పాంజలి, కుర్చీ మడతపెట్టి, మొక్కజొన్న తోటలో, జింతాక, చిల్ బ్రో తదితర పాటలకు సినిమా పాటలకు నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సపాల్ ప్రమీల దేవి మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారు అని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రమీల దేవి, నృత్య శిక్షకుడు శబరిష్ ,పరిపాలనా అధికారి సుధాకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.






# క్షతగాత్రులను పరామర్శించిన వైయస్ మనోహర్ రెడ్డి



పులివెందుల మేజర్ న్యూస్ పులివెందుల పట్టణ పరిధిలో కూలి పని నిమిత్తం వెళుతున్న ఆటో లారీని ఢీకొన్న సంఘటన ఆదివారం చోటు చేసుకోగా విషయం తెలిసిన మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి తక్షణమే స్పందించి క్షతగాత్రులను హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించి మెరిగిన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులకు సూచనలు సలహాలు అందించారు. వివరాలకు వెళితే రాజీవ్ గాంధీ కాలనీ నుంచి కూలి పనులకై మహిళలు కొంతమంది ఆటోలో వెళ్తుండగా అరటికాయల లోడు వెళ్తుండగా పార్నపల్లి రోడ్ లో రంగాపురం దగ్గర కూలీల ఆటోను ఢీకొన్న లారీ క్షతగాత్రులను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వల్లపు వరప్రసాద్ పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి కౌన్సిలర్ కోడి రమణ అంకాలమ్మ గుడి చైర్మన్ బ్యాటరీల ప్రసాద్ వైసీపీ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరికి పోయి క్షతగాత్రులను పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్షతగాత్రుల బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

# ఆటోను ఢీకొట్టిన లారీ..

# 12 మంది కూలీలకు గాయాలు



పులివెందుల మేజర్ న్యూస్ పులివెందుల పట్టణంలోని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల సమీపంలో ఆటోను లారీ ఢీ కొట్టిన ఘటనలో దాదాపు 12 మంది కూలీలకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు పులివెందుల పట్టణానికి చెందిన మహిళా కూలీలు ఆటోలో ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ భూమిలో కూలి పనుల నిమిత్తం వెళుతుండగా, పులివెందుల నుంచి లింగాల వైపు వెళ్తున్న అరటికాయల లారీ ముందు వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ఈ సంఘట సంఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. భవాని,రాజేశ్వరి లకు తీవ్ర గాయాలు కాగా మిగతా పదిమంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలంలో కూలీల ఆర్తనాదాలు మిన్నంటాయి. కూలీలు స్వల్ప గాయాలతో బయటపడడంతో కూలీలు, కూలీల కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ హాజీవల్లి సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సిఐ హాజివల్లి తెలిపారు.

## చలువ ముద్ద పెట్టి ప్రత్యేక పూజలు చేసిన మహిళలు



వేంపల్లె మేజర్ న్యూస్:స్థానిక పెద్ద దేవరగడ్డ వీధిలో వెలసిన గంగమ్మ కు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలందరూ గంగమ్మకు జలాభిషేకం చేసి చలవ ముద్దను ఏర్పాటు చేసి బోనాలను నైవేద్యంగా పెట్టి తమ ముక్కును తీర్చుకున్నారు. ప్రతి ఏడాది ఉగాది దగ్గర పడుతున్న సమయంలో గంగమ్మకు చలవ చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆదివారం గంగమ్మ ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గంగమ్మా.. చల్లంగా చూడమ్మా అంటూ చుట్టూ ప్రదర్శనలు చేసి వేడుకున్నారు. ఈ సందర్భంగా జంతు బలులను చేశారు. గత రెండు సంవత్సరాలుగా వర్షాలు కురవక రైతులకు పంటలు పండక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఈ ఏడాదైనా వర్షాలు బాగా కురిసి గ్రామ ప్రజలు, రైతులు సుఖశాంతులతో జీవనం సాగించాలని కోరుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గౌరీదేవి ఆలయ సంఘం ప్రెసిడెంట్ నంబూరు కులాయప్ప, నక్కా. రాజారామ్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్‌లను బెదిరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## ఏపీ యుడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి పల్లెటి రామసుబ్బారెడ్డి

## జిల్లా ఎస్పీని కలిసిన ఏపీ యుడబ్ల్యుజే బృందం



కడప - మేజర్ న్యూస్ జర్నలిస్ట్ భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి ని బెదిరించిన వేంపల్లి మాజీ యం.పి.టి.సి , టిడిపి నాయకుడు జి.వి రమణ పైనా అతని అనుచరులపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ యుడబ్ల్యుజే ప్రతినిధి బృందం రాష్ట్ర కార్యదర్శి పల్లెటి రామసుబ్బారెడ్డి నాయకత్వం జిల్లా ఎస్పీ ఈ.జి.ఆశోక్ కుమార్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీలో జరిగిన పరిణామా లపైన వార్తలు వ్రాయడం వల్ల మాజీ యం.పి.టి.సి కక్ష్య కట్టి వాట్సాప్ గ్రూప్‌లో జరిగిన మెసెజ్‌ని సాకుగా చూపి అలా బెదిరించడం తగదన్నారు. విలేకరి తప్పు చేస్తే పిర్యాదు చేయాలి తప్ప చంపుతానని బెదిరించడం ప్రజాస్వామ్యంలో తగదని పల్లెటి రామసుబ్బారెడ్డి పెర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తప్పు చేస్తే ప్రశ్నించమని స్వయంగా ముఖ్యమంత్రి చెబుతుంటే స్థానికంగా మాత్రం పరిస్థితులు వేరేగా ఉన్నాయని తెలిపారు. శ్రీనాథ్‌రెడ్డిని బెదిరించడం ద్వారా మిగిలిన జర్నలిస్ట్ కూడా తమపై వార్తలు వ్రాయకుండా ఉంటారనే దృష్టితోనే ఇలా చేశారని తెలిపారు. దీని వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందనే అనుమానాలు తమకు ఉన్నాయని తెలిపారు. విలేకరులను బెదిరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని యస్పీ ఆశోక్‌కుమార్ తెలిపారు. పిర్యాదును స్వీకరించి తగుచర్యలకు సంబంధిత అధికారులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షులు భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి, జిల్లా నాయకులు ఆంజనేయులు, సుబ్బారెడ్డి, శివ పాల్గొన్నారు